ఏనుగుల సంచారంతో రైతుల్లో ఆందోళన 9
నిష్క్రియాత్మక ఖాతాలతో ఆర్థికవ్యవస్థకు చేటు : ఏడీసీ

హద్దులివే..!



గ్రేటర్ బెంగళూరు కార్యాలయం

- జీబీఏ వార్డులకు సరిహద్దుల నిర్ణయం
- జనాభాకు అనుగుణంగా విభజన
- అధికారికంగా ప్రకటించిన అధికారులు
- వెబ్‌సైట్‌లో పరిశీలనలకు అవకాశం
- వార్డుల పేర్ల మార్పుపై విమర్శలు
- కాంగ్రెస్ నేతలపై బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ) గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)గా మారింది. ఐదు పాలికెల విభజన కూడా ముగిసింది. మరో అడుగు ముందుకేసి ఏకంగా 369 వార్డులకు పెంచారు. బీబీఎంపీలో దశాబ్దన్నర కాలానికి పైగా 198 వార్డులు మాత్రమే ఉండేవి. ఒక్కసారిగా పాలికెల సంఖ్య 5కు పెరిగినట్లుగానే అదనంగా 171 వార్డులకు విస్తరించాయి. గడిచిన కొన్నేళ్లుగా బీబీఎంపీ, జీబీఏ ఏదైనా వార్డు నెంబర్ల మొత్తం 9గా వచ్చేందుకు కసరత్తు జరిపారు. గతంలో బీజేపీ ప్రభుత్వంలో పాలికె విభజించకుండా 243 వార్డులు చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో బీజేపీ ప్రభుత్వం చేసిన వార్డులను మార్చాలని భావించి 234 వార్డులకు కుదించారు. అయితే వార్డుల విభజన, రిజర్వేషన్ విషయంలో తీవ్ర జాప్యం చేసి ఏకంగా పాలికెను విభజించేశారు. ఐదు పాలికెల పరిధిలోనూ జనాభాకు తగ్గట్టుగా వార్డులను విభజించారు. వార్డుల సరిహద్దుల సమాచారాన్ని నగరాభివృద్ధిశాఖ గురువారం లాంఛనంగా విడుదల చేసింది. జీబీఏలోని ఐదుపాలికెలలో 369 వార్డులు ఉండగా వాటికి సంబంధించిన పాలికెల పేర్లు, శాసనసభ నియోజకవర్గాలను గుర్తించారు. ఈ సరిహద్దుల మ్యాప్ సంబంధిత వార్డుల సమగ్ర సమాచారం ఇవ్వనుంది. ఇందులోనే జనాభా వివరాలను పొందుపరిచారు. ఎస్సీ, ఎస్టీతోపాటు ప్రత్యేక గణాంకాలను వార్డుల విభజన గురించి తెలుసుకునే వెసలుబాటు ఉంది. నగరాభివృద్ధిశాఖ, గ్రేటర్ బెంగళూరు అథారిటీ (బీబీఎంపీ) వెబ్‌సైట్‌లలో వీక్షించే వెసలుబాటు ఉంది. ప్రజలు తమ వార్డుల వివరాలను తెలుసుకునేందుకు వీలు కల్పించారు.

కొనసాగిన తప్పుల పరంపర

చివరి గెజిట్‌ను పాలికెల వారీగా, వార్డులు, వాటి పేర్లు, ప్రదేశం, సరిహద్దుల సమాచారాన్ని పొందుపరిచే విషయంలో తప్పుల పరంపర కొనసాగింది. గెజిట్ ప్రకటించిన వేళ పలు తప్పులు ఉండేవి. వాటిని సర్దుబాటు చేసి సరైన ప్రక్రియలో వార్డుల విభజన చేస్తామని జీబీఏ కమిషనర్, వార్డుల పునర్విభజన కమిషన్ చైర్మన్ ప్రకటించారు. అయితే కొన్ని వార్డుల సమాచారాన్ని యథావిధిగా వదిలేశారు. ప్రధానంగా వార్డుల పేర్లు తప్పుగా నమోదు చేశారు. ఇంగ్లీష్, కన్నడ భాషల్లోని గెజిట్‌లలో వేర్వేరు అర్థాలు వచ్చేలా ముద్రించారు. కన్నడ భాషలోని గెజిట్‌లో పలు పొరపాట్లను సవరించే ప్రక్రియ కూడా చేపట్టలేదు. ప్రస్తుతం విడుదల చేసిన గెజిట్ ఆదేశాల నమూనాలు సుప్రీం కోర్టుకు సమర్పించాల్సి ఉన్నందున తప్పులను అలాగే వదిలేశారని కొందరు మాజీ కార్పొరేటర్లు పేర్కొంటున్నారు.


జీబీఏ మ్యాప్

అటు పేర్లు ఇటు..

వార్డుల పేర్లను తుదిగా ఖరారు చేసేవేళ స్థానిక ప్రదేశాన్ని కేంద్రంగా గుర్తిస్తారు. కానీ కొన్ని వార్డులకు పేర్లు ఉన్నా వాటికి అనుగుణంగా వేర్వేరు ప్రాంతాలు సూచిస్తున్నాయి. పశ్చిమపాలికెలో విస్తీర్ణం, వార్డుల సంఖ్య పెద్దగా ఉంది. పేర్లు కూడా సమగ్రంగా లేవు. చిక్కల్లసంద్రను చిక్కకల్లసంద్రగా మార్చారు. అదే తరహాలోనే ఫ్రీడం ఫైటర్ పేరును కన్నడలో స్వాతంత్ర్య యోధుల నగర్‌గా గుర్తించాల్సి ఉండేది. రాజమహల్ గుట్టహళ్ళి ప్రదేశాన్ని కేవలం రాజమహల్‌గా మాత్రమే పరిగణించారు. ఒకేపేరుతో ఉండే వార్డుల పేర్లు గందరగోళానికి కారణమవుతున్నాయి. 9వ వార్డు శ్రీగంధనగర్‌గా ఖరారు చేశారు. 27వ వార్డు శ్రీగంధకావల్‌గా మార్చారు. 5వ వార్డు రాజేశ్వరీనగర్, 23వ వార్డు రాజరాజేశ్వరీనగర్‌గా గుర్తించారు. 59వ వార్డును బండిరెడ్డి సర్కిల్‌గా గుర్తించారు. అక్కడ శ్రీరాంపు లేదా రామచంద్రాపుర పేరు పెట్టేందుకు వీలుండేది. 101వ వార్డును కెంపాబుదిగా మాత్రమే నమోదు చేశారు.

ఇంగ్లిష్ పేర్లపై ఆగ్రహం

తూర్పు పాలికెలోని 3వ వార్డులో చల్లకెరెగా నమోదు చేశారు. చెళ్ళకెరెగా ఏర్పాటు చేయాల్సి ఉండేది. 25వ వార్డును ఎల్‌బీ శాస్త్రినగర్‌గా గుర్తించారు. అయితే లాల్‌బహద్దూర్‌శాస్త్రిగా గుర్తించి ఉంటే బాగుండేది. 36వ వార్డును భారత్ ఐక్యవార్డుగా ఖరారు చేశారు. ఇది ఎవరికి అనుకూలమైన పేరో అర్థంకాని విధంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక యలహంక పరిధిలోని ఉత్తర పాలికెలో రెండో వార్డును ఆకాశ్ పేరుగా గుర్తించారు. ఇది ఏ ప్రదేశానికి చేరిందనేది అంతుచిక్కనిదిగా ఉంది. ఆకాశ్ అనే పేరుతో యలహంకలో ఒక్క లే అవుట్ కూడా లేదు. వెంకటాచల లేదా మారుతినగర్ ప్రదేశంగా ఎంపిక చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మూడో వార్డుకు యలహంక ఓల్డ్‌టౌన్‌గా గుర్తించారు. యలహంక హళె పట్టణ (పాత ఊరు)గా నమోదు చేయాల్సి ఉండేది. యలహంక శాటిలైట్ టౌన్‌గాను గుర్తించే వెసలుబాటు ఉండేది. గెజిట్‌లో 'యలహంక ఉపగ్రహ పట్టణ'గా నమోదు చేసి నవ్వులపాలైనట్టు అయ్యింది. కన్నడపేర్ల మనుగడ లేకుండా చేశారని యలహంక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 54, 55వ వార్డులు గంగేనహళ్ళి, గంగానగర్‌గా గుర్తించారు. బీబీఎంపీలో ఉన్నప్పుడు స్థానికులకు తాము ఏ వార్డులో ఉన్నామనే గందరగోళం ఉండేది. ఆ సమస్యను నగరాభివృద్ధిశాఖ గమనించకుండా కొనసాగించింది.


బీబీఎంపీ కేంద్ర కార్యాలయం

ఆడుగూడిలో గందరగోళం..

దక్షిణపాలికెలోని 15వ వార్డులో శాకంబరినగర్‌కు బదులుగా శాకాంబరినగర్‌గా పేరు మార్చారు. 21, 24 వార్డుల్లో చిక్క ఆడుగూడి, ఏ ఆడుగూడి పేర్లు గందరగోళానికి కారణమయ్యాయి. 54వ వార్డులో కెంగల్ హనుమంతయ్య దక్షిణగా నమోదు చేశారు. ఇదే పేరుతో పశ్చిమ పాలికెలోనూ ఓ వార్డుకు నమోదు చేశారు. కన్నడ భాషరానివారు ఇలాంటి తప్పిదాలు చేశారనే విమర్శలు ఉన్నాయి.

మాజీ ఉపప్రధాని పేరుతో గుర్తింపు లేదు

బెంగళూరు సెంట్రల్ పాలికెలో 19వ వార్డు జీవనభీమనగర్ పేరుగా గుర్తించారు. ఇది జీవనబీమానగర్‌గా గుర్తించాల్సి ఉండేది. 23వ వార్డు జోగపాళ్యగా ఉంది. జోగుపాళ్యగా నమోదు చేయాల్సి ఉండేది. 50వ వార్డును జేజేఆర్ నగర్‌కు బదులు జగజ్జీవన్ రాంనగర్‌గా నమోదు చేసి ఉంటే సముచితంగా ఉండేది.

ఆకాశ్ డీకే శివకుమార్ కుమారుడా... : ఎమ్మెల్యే ఆగ్రహం

యలహంక పరిధిలోని 2వ వార్డుకు ఆకాశ్‌గా పేరు పెట్టారు. ఆ పేరు అక్కడ ప్రస్తావించేందుకు ఎటువంటి ఆనవాళ్లు లేవు. కానీ ఎందుకు పేరు పెట్టారని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ మండిపడ్డారు. డీసీఎం డీకే శివకుమార్ కుమారుడి పేరుగా ఉందని మండిపడ్డారు. వ్యక్తిగతమైన పేర్లు పెట్టేందుకు అంగీకరించేది లేదని, మార్పు చేయాల్సిందేనన్నారు. ఒకటో వార్డుకు రాజా కెంపేగౌడ పేరుగాను, 2వ వార్డుకు చౌడేశ్వరి వార్డుగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తానన్నారు.


చిరుత (ఫైల్)

బన్నేరుఘట్ట జూలో చిరుత మృతి

దొమ్మసంద్ర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్ట జూలో అనారోగ్యం కారణంగా రెండురోజుల క్రితం చిరుత మృతి చెందింది. 2023 జనవరి 3న చామరాజనగర బిళగిరి రంగనతిట్టు పులుల అభయారణ్యం నుంచి ఈ చిరుతను జూకు తెచ్చారు. అక్టోబరు 30 నుంచి చిరుత సరిగా ఆహారం తీసుకోలేదు. దీంతో పరీక్షలు చేయగా జ్వరం ఇతర సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. మాంసాహారంలోనే మందులు కలిపి ఇవ్వడం ద్వారా చికిత్సలు కొనసాగించారు. దీంతో కొంత కోలుకుంది. అయితే ఈనెల 13నుంచి ఆహారం పూర్తిగా తీసుకోలేదు. శ్వాసకోశ సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించి చికిత్సలు అందించారు. అయినా ఫలించక ఈనెల 19న మృతి చెందిందని జూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

వేటలో మిస్‌ఫైర్

- అడవిపందిని కాల్చబోయి గురి తప్పిన నాటు తుపాకీ.. వేటగాడి దుర్మరణం

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అడవిపందిని వేటాడబోయి ఓ వేటగాడు దుర్మరణం పాలయ్యాడు. రామనగర జిల్లా మాగడి అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేటకు వెళ్లిన సమయంలో నాటు తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో వేటగాడు పాండురంగ (35) దుర్మరణం చెందాడు. స్నేహితుడు కిరణ్‌తో కలసి నాటుతుపాకీతో వేటకు వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున కెబ్బేపాళ్య గ్రామ శివారులోని అటవీప్రాంతంలో వెళ్తున్నారు. ఒక్కసారిగా అడవిపంది పాండురంగ సమీపానికి వచ్చింది. కాల్చడం ఆలస్యం అవుతుందని తుపాకీని తిప్పి కొట్టే ప్రయత్నం చేశాడు. అంతలోనే ట్రిగ్గర్‌కు తగలడంతో బుల్లెట్ నేరుగా పాండురంగ కాలిలోకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా అతను అక్కడికక్కడే కుప్పకూలాడు. స్నేహితుడు కిరణ్ అక్కడనుంచి కొంతదూరం తీసుకెళ్లాడు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. పాండురంగను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. పోలీసులు పాండురంగ కుటుంబీకులపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా తుపాకీ ఉపయోగించడంపై దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా నాటు తుపాకీలతో జంతువులను వేటాడితే చర్యలు తప్పవన్నారు.

అక్రమాలు, అవినీతిలో కాంగ్రెస్ చాంపియన్

- ప్రతిపక్షనేత అశోక్ ఎద్దేవా
- రోడ్ల దుస్థితిపై ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలలో ఛాంపియన్‌గా ఉందని ప్రతిపక్షనేత అశోక్ ఎద్దేవా చేశారు. మల్లేశ్వరం పార్టీ కార్యాలయంలో ఆయన కాంగ్రెస్ కర్మకాండ పేరిట పోస్టర్‌లను విడుదల చేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ డీకే శివకుమార్‌కు పదవి ఆశతో బెంగపడి డ్రిప్స్ వేసుకున్నారని, ఢిల్లీ వెళ్లినవారికి క్యాబినెట్ నుంచి తొలగిస్తానంటూ ముఖ్యమంత్రి బెదరిస్తున్నారన్నారు. డీసీఎం వెళ్లమంటారని, సీఎం ఎందుకు వెళ్తారని ప్రశ్నిస్తారన్నారు. ఇలా రాజకీయాల్లో మునిగిపోయారని, ప్రజాసమస్యలు వారికి పట్టవన్నారు. ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టడంలో సిద్దరామయ్య కంటే అప్పులు చేయడంలోనూ ఆయనే టాప్ సీఎం అన్నారు. రైతుల ఆత్మహత్యలు వీరికి పట్టవని, కాంట్రాక్టర్ల కష్టాలు పట్టించుకోరన్నారు. ఒప్పందం ఏముందనేది ఢిల్లీవారు చెప్పరని, ఇక్కడి నాయకులు తల్లడిల్లుతున్నారన్నారు. రాష్ట్రప్రజలంతా ఏం జరిగిందో బహిరంగం చేయాలని కాంగ్రెస్‌నేతలను డిమాండ్ చేసే పరిస్థితి నెలకొందన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లు, రోడ్డుపక్కన చెత్తకుప్పలను చూపి బెంగళూరు పరిస్థితి అధ్వానంగా మారిందనేందుకు ఇవే నిదర్శనమన్నారు. ఎంపీలు పీసీ మోహన్, గోవింద కారజోళ, ఎమ్మెల్సీ రవికుమార్ పాల్గొన్నారు.


నగరంలో రహదారిని పరిశీలిస్తున్న ప్రతిపక్షనేత అశోక్

సేవాతత్పరులు బాలగంగాధరనాథస్వామి

- కేంద్ర మంత్రి కుమారస్వామి
- ఘనంగా బీజీఎస్ ఉత్సవ్ ప్రారంభం
- హాజరైన పలువురు మఠాధిపతులు

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదిచుంచనగిరి మఠాధిపతిగా బాలగంగాధరనాథస్వామి సేవా తత్పరులని, సమాజంకోసం విద్య, వైద్యం, ఆధ్యాత్మికంతోపాటు ఎన్నో రంగాలలో సేవలు కొనసాగించారని కేంద్రమంత్రి కుమారస్వామి అన్నారు. బీజీఎస్ ఉత్సవ్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ, సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామిజీ, సిద్దగంగా మఠాధిపతి సిద్దలింగస్వామీజీ, బీజీఎస్ ఎస్‌జేబీ విద్యాసంస్థల ఎండీ ప్రకాశనాథస్వామీజీతోపాటు కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, నటులు మాలశ్రీ, ఆరాధన, సౌందర్యగౌడ తదితరులు పాల్గొన్నారు. సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామిజీ మాట్లాడుతూ బాలగంగాధరనాథస్వామి దార్శనికులే కాకుండా దూరదృష్టితో ఎన్నో సంస్థలను కట్టారన్నారు. భక్తులు ఇచ్చిన కానుకలు సమాజం ద్వారా ఇతరులకు ప్రయోజనం కలిగేలా తీర్చారన్నారు. కొందరు భక్తులు కొబ్బరికాయ ఇస్తారని వాటిని కూడా మంచి మనోభావంతో స్వీకరించేవారన్నారు. నిర్మలానందనాథస్వామిజీ మాట్లాడుతూ ఆదిచుంచనగిరి మఠానికి 1500 ఏళ్ల చరిత్ర ఉందని, అక్షరం, జ్ఞానం, అన్నం సమకూర్చడం ద్వారా లక్షలాదిమంది జీవితాలలో మార్పులు తీసుకొచ్చారన్నారు. కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, గుణాత్మకమైన విద్య అందించే విషయంలో ఎన్నో కష్టాలు పడుతోందని, కానీ మఠం విద్యాసంస్థలను విజయవంతంగా జరుపుతోందన్నారు. ప్రకాశనాథస్వామీజీ మాట్లాడుతూ బోధనలతోపాటు ఇక్కడి విద్యార్థులకు నైతిక విలువలు నేర్పుతామన్నారు. బీజీఎస్‌లో సేవల ద్వారా పేరొందిన అకడమిక్ సలహాదారురాలు కళ జీ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ప్రకాశ్, లైబ్రేరియన్ వినయ్, లలిత కళల టీచర్ గుంజన్ సచ్‌దేవ్‌తోపాటు బాబు, అరవింద సజవాల్‌లకు బీజీఎస్ సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు.


బీజీఎస్ సేవారత్న పురస్కార గ్రహీతలతో కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, వివిధ మఠాధిపతులు

1166 మంది గానం

- సామూహిక గేయాలాపనతో రంగసంస్థాన వరల్డ్ రికార్డు


రికార్డు అందుకుంటున్న బండ్లహళ్లి విజయకుమార్

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంగసంస్థాన సంస్థ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. రంగసంస్థాన అధ్యక్షుడు బండ్లహళ్ళి విజయకుమార్ నేతృత్వంలో రెండురోజులక్రితం బాగలూరులోని విజయజ్యోతి గ్రూప్ విద్యాసంస్థల ప్రాంగణంలో 1,166 మంది సామూహిక గేయాలాపన చేశారు. నాడోజ ఉడే పి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేస్తే వారి ఆలోచనా విధానాలలో మార్పు వస్తుందన్నారు. కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ మల్లేపురం వెంకటేశ్ మాట్లాడుతూ కన్నడకు గొప్ప చరిత్ర ఉందన్నారు. భాషను అభివృద్ధి చేసేందుకు ప్రతి కన్నడిగుడు సిద్ధం కావాలన్నారు. విజయజ్యోతి సంస్థ అధ్యక్షుడు రామచంద్ర, మండ్య యూనివర్సిటీ కులపతి డాక్టర్ కే శివచిత్తప్ప, ఆకాశవాణి ముఖ్యులు తిమ్మప్ప హెచ్ గౌడ, కవి కావెం శ్రీనివాసమూర్తి, చిక్కహనుమంతేగౌడ, బైరేగౌడ, సంగూరుమఠ తదితరులు పాల్గొన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు లభించినట్లు ప్రకటించారు. ప్రతినిధులు ప్రశంసాపత్రాన్ని అందించారని ఆయన మీడియాకు తెలిపారు.


సామూహిక గేయాలాపనలో బాలికలు

జేడీఎస్‌కు ఆదరణ ఎన్నటికీ తగ్గదు

- మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీకి ఎన్నడూ వన్నె తగ్గదని, పార్టీ వీడినవారు ఎలా ఉన్నారో చూడాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అన్నారు. పార్టీ రజతమహోత్సవ నేపథ్యంలో నగరంలోని జేపీ భవన్‌లో శుక్రవారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జేడీఎస్ పార్టీ విజయాల గురించి ఛాయాచిత్ర ప్రదర్శనను వీక్షించారు. కేంద్రమంత్రి కుమారస్వామి, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్‌కుమారస్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ దేవెగౌడ విజయాలు యువతకు మార్గదర్శకం కావాలని, పార్టీ బలోపేతానికి, యువతకు స్ఫూర్తి అన్నారు. దేవెగౌడ పోరాటాన్ని కుమారస్వామి కొనసాగిస్తారన్నారు.


ప్రసంగిస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ

రేపు కెనరా బ్యాంకు మారథాన్

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం జరుగుతున్న మారథాన్‌కు ఏర్పాట్లు జోరందుకున్నాయి. సమాజంలో పటిష్టమైన ఫిట్‌నెస్‌తోనే ఆరోగ్యం సాధ్యమనే నినాదంతో కెనరాబ్యాంకు ఏటా మారథాన్ జరుపుతోంది. తెల్లవారుజామున 5.45 గంటలకు 10కే, 6.45 గంటలకు 5కే, 8 గంటలకు 3కే పోటీలు జరుగుతాయని బ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు ప్రకటించారు. కంఠీరవ స్టేడియంలో మారథాన్ ప్రారంభంతోపాటు ముగింపు ఉంటుందన్నారు. మారథాన్ సాగే ప్రదేశాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీసు అధికారులు వెల్లడించారు. విఠల్‌మల్యా రోడ్డుతోపాటు పార్కింగ్ సదుపాయ ఉండగా మారథాన్ జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉంటాయన్నారు.

గంజాయి కేసులో ఐదుగురికి పదేళ్ల జైలు

రూ. లక్ష చొప్పున జరిమాన

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా, విక్రయానికి సంబంధించిన కేసులో ఐదుగురు ముద్దాయిలకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం అనంతపురం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి తీర్పు వెలువరించారు. ఆరుగురు ముద్దాయిలకు శిక్ష విధించగా.. ఏ6 ముద్దాయి ఇప్పటికే మరణించాడు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన గంగాధర్ (36), స్వాతి(34) ఇంట్లో 2020 జూలై 18న స్పెషల్ డ్యూటీ ఆఫీసర్, సెబ్ సీఐ మారుతీరావు, 4వ పట్టణ సీఐ శ్రీనివాసులు తనిఖీలు చేశారు. వారి వద్ద 30 కిలోల గంజాయి దొరకడంతో సీజ్ చేశారు. అదేవిధంగా తాటిచెర్లకు చెందిన మేకల ప్రసాద్(40) వద్ద 10 కిలోలు, పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన షేక్ గౌసియా(44) వద్ద 10 కిలోలు, గుంతకల్లు మండలం తిమ్మాపురానికి షేక్ హాజీవలి(28) వద్ద రెండున్నర కిలోలు గంజాయి దొరకడంతో కేసులు నమోదు చేశారు. కేసు విచారణ తర్వాత సీఐ ప్రతాప్ఎరెడ్డి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును న్యాయాధికారి సత్యవాణి విచారణ చేశారు. ఐదుగురు ముద్దాయిలు నేరం చేసినట్టు రుజువు కావడంతో.. గంగాధర్, స్వాతి, ప్రసాద్, షేక్ గౌసియా, షేక్ హాజీవలికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అదేవిధంగా ముద్దాయిలకు తలా రూ. లక్ష జరిమాన కూడా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో 6వ ముద్దాయిగా ఉన్న అనంతపురంలోని భైరవనగర్‌కు చెందిన అడవాల చంద్రశేఖర్(30) మరణించాడు.

లక్షణంగా కొట్టేశాడు

లింక్‌తో వీఆర్‌ఓను ఖరీదీ కొట్టించిన ఆర్‌ఐ

రూ.1.19లక్షలు స్వాహా



నగదు డెబిట్ అయిన స్ర్కీన్‌షాట్

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తన డిపార్ట్‌మెంట్ ఉద్యోగి పంపిన లింక్‌ను ఓపెన్ చేసిన ఓ వీఆర్‌ఓ రూ.1.19 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పెనుకొండలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలైన వీఆర్‌ఓ యశస్విని తెలిపిన మేరకు.. పెనుకొండలో ఆర్‌ఐగా పని చేసి బదిలీపై వెళ్లిపోయిన పురుషోత్తం నంబర్ నుంచి తనకు వాట్సాప్ ద్వారా ఆర్టీఓ ట్రాఫిక్ చలానా అనే యాప్‌లింక్ బుధవారం వచ్చిందన్నారు. ఏంటి ఇది అని అతడికి మెసేజ్ పెట్టగా, ఓపెన్ చేయమని సమాధానం వచ్చిందన్నారు. దీంతో ఒకే డిపార్ట్‌మెంట్ కదా అనుమానించడానికే ముందని, రెవెన్యూ సేవలకు అవసరం అవుతుందేమోననే నమ్మకంతో ఆ లింక్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. ఇంతలో తన అకౌంట్‌లో ఉన్న రూ.1.19లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో ఆందోళనతో బ్యాంక్ బాలెన్స్ చెక్‌చేస్తే నగదు కనిపించలేదని తెలిపారు. దీంతో పుట్టపర్తి సైబర్ క్రైం కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి-జూటూరు సమీపంలో వంశీ (21) అనే విద్యార్థి శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దపప్పూరు మండలం తబ్జుల గ్రామానికి చెందిన రామాంజనేయులు, నాగమ్మ దంపతుల కుమారుడు వంశీ చిత్తూరు జిల్లా ఎస్వీసెట్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ అర్థాంతరంగా వదిలేశాడు. ఇంటికి వచ్చి ఖాళీగా ఉండేవాడు. చదువు అబ్బడం లేదని, ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని తరచూ తన స్నేహితులతో చెప్పేవాడు. భవిష్యత్తుపై బెంగతోనే దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఏపీఆర్ఆర్‌పీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు. మిగిలిన స్కీమ్స్ ద్వారా జరుగుతున్న పనులు మార్చిలోపు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్లకు ఫీల్డ్‌లో ఏదైనా సమస్య ఉంటే వాటికి తగిన పరిష్కారమార్గాలు చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఈఈలు శ్రీరాములు, శంకరయ్య, పీఏ టూ ఎస్ఈ రాజేంద్రప్రసాద్, డీఈలు తిరుమలరెడ్డి, నారాయణస్వామి, సుధాకర్ నాయక్, నాగేంద్రకుమార్, మదన్‌మోహన్, మురళీధర్, వెంకటేష్, హనుమంతయ్య శెట్టి, ఏఈఈలు రజినీకాంతరెడ్డి, పాండురంగారెడ్డి, సూర్యశేఖర్, మల్లికార్జున, రాజేంద్రప్రసాద్, నళిని, ప్రసాద్, రామాంజనేయులు, కాంట్రాక్టర్లు వెంకటనాగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శోమశేకర్‌రెడ్డి, సుధాకర్, ధనంజయనాయుడు, వెంకటేష్ సర్కిల్ ఆఫీస్ ఏఈఈ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గుత్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి రైతులకు ధర అందుతుందన్నారు. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.8100, కనిష్ఠంగా రూ.8010వేలు ధర చెల్లిస్తారని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోస పోకుండా పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏఈ రాఘవేంద్రకుమార్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీఏ వెంకటరాముడు, తహసీల్దార్ పుణ్యవతి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు ఏఓలు ముస్తాక్ అహ్మద్, విజయ్‌కుమార్, మునికృష్ణ, మార్కెట్ యార్డు సెక్రటరీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక


కోచ్, తండ్రితో మనస్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు మనస్విని ఎంపికయింది. ఈనెల 22వతేదీ నుంచి జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ యూనివర్సిటీలో జరిగే నేషనల్ టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలికల విభాగంలో మనస్విని రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయ పోటీలకు ఎంపికైన మనస్వినిని ఆమె తండ్రి, రాయ్ టేబుల్‌టెన్నిస్ అకాడమీ కోచ్ రవీంద్రనాథ్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..?

ఈకేవైసీతో 50వేలకుపైగా కూలీల తొలగింపు

5,26,534 మందికిగాను..

4,12,361 మందితో ఐరిస్ సేకరణ

నేడు గ్రామ సభలు.. అభ్యంతరాల స్వీకరణ


శింగనమల మండలంలో ఉపాధి కూలీకి ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతేలేదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తున్నా లొసుగులను అడ్డం పెట్టుకుని కొందరు ఆయాచితంగా లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానం అమలుతోనయినా ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తోంది. అక్టోబరు నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయడం మొదలుపెట్టారు. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తొలుత అక్టోబరు నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబరు నుంచి ఈకేవైసీ చేయించుకున్న కూలీలకు మాత్రమే వేతనాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఆశించిన మేరకు ఈకేవైసీ పూర్తి చేయకపోవడంతో గడువును పొడిగించారు. అయినప్పటికీ పలు గ్రామ పంచాయితీల్లో పెండింగ్‌లోని కూలీలతో ఈకేవైసీ చేయించడంలో సిబ్బంది జాప్యం చేస్తుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 5,26,534 మంది ఉపాధి కూలీలు ఉన్నట్లు జాబితాలో చేర్చారు. ఇందులో ఇప్పటి దాకా 4,12,361 మందితో (78.35 శాతం) ఐరిస్ సేకరణ పూర్తి చేశారు. ఇంకా 1.14 లక్షల మంది పెండింగ్ జాబితాలో ఉన్నారు.

బయటపడుతున్న బోగస్ కార్డులు

ఉపాధి కూలీలతో ఈకేవైసీ ప్రక్రియలో బోగస్ జాబ్ కార్డులు, కూలీలు బయటపడుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 50వేల మందికిపైగా కూలీల పేర్లను తొలగించినట్లు తెలిసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన వారి పేర్లను అలాగే ఉంచేందుకు పలు మండలాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల నుంచి డ్వామా అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయడంలో పలు ప్రాంతాల్లో జాప్యానికి రాజకీయ నేతల నుంచి సిబ్బందికి ఒత్తిళ్లే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పలువురు కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. అలాంటి కూలీలకు సమాచారం అందించి, ఈకేవైసీ చేయించడంలో పలు ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నేడు పంచాయతీల్లో గ్రామ సభలు

జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన వారిలో నిజమైన కూలీలు ఉంటే గ్రామ సభల్లో అర్జీలు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్త జాబ్ కార్డులు, ఉపాధి పనుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు డ్వామా అధికారులు, సిబ్బంది గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ సభల్లో ఈకేవైసీ వివరాలు ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈకేవైసీ ప్రక్రియలో భాగంగా తొలగించిన జాబితాలో నిజమైన కూలీలు ఉంటే తిరిగి జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. సందట్లో సడేమియా అన్న చందంగా కొందరు రాజకీయ నాయకులు ఉపాధి పనులకు వెళ్లకుండా ఇదివరకు డబ్బులు కాజేసిన తమకు అనుకూలమైన వారి పేర్లను జాబితాలో తిరిగి ఎక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఈకేవైసీ ప్రక్రియ వంద శాతం సవ్యంగా సాగుతుందో..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తాం. అలాగే కొత్తగా జాబ్ కార్డులు, ఉపాధి పనుల కల్పన కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలతో వ్యక్తిగతంగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టవచ్చు.

- సలీం బాషా, డ్వామా పీడీ

నాలుగేళ్ల కిందటి కేసు విచారణ

నారాయణ మృతి కేసులో డీఎస్పీ విచారణ ప్రారంభం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసు అధికారి

నా భర్తను పోలీసులే చంపారు: మృతురాలి భార్య


నారాయణ (ఫైల్)

పెద్దపప్పూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన నారాయణ మృతిపై అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం విచారణ ప్రారంభించారు. నారాయణ 2021 ఆగస్టు 2న మృతి చెందిన విషయం తెలిసిందే. తన భర్త చావుకు అప్పటి డీఎస్పీ చైతన్య, ఎస్ఐ గౌస్ కారణమని నారాయణ భార్య వెంకటలక్ష్మి అధికారుల వద్ద అప్పట్లోనే వాపోయింది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విషయాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి ఆమె వివరించింది. దీంతో ఆయన నారాయణ మృతి విషయాన్ని అసెంబ్లీ వేదికగా లేవనెత్తారు. దీంతో ప్రభుత్వం ఈ కేసును కూలంకషంగా విచారించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. నారాయణ ఎలా మరణించారు కారణాలు ఎవరెవరు అనే దానిపైన పలువురిని విచారించారు. వీటిపై త్వరలో నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు.

విచారణ కోసం తీసుకెళ్లి..

బాధితురాలు వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు... తన భర్త నారాయణను 2021 ఆగస్టు 1 పొలం సమస్య విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాలని అప్పటి ఎస్ఐ గౌస్ పిలిపించారు. అదే రోజు సాయంత్రం ఆశా వర్కర్ ఇంటి వద్దకు వచ్చి 'మీ భర్త ఆరోగ్యం బాగాలేదు. మీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లండి' అని తెలిపారు. దీంతో వెంకటలక్ష్మి తన కుమారుడు, కుమార్తెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి, బంధువులతో కలిసి పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. 'నీ భర్తను తాడిపత్రి డీఎస్పీ ఆఫీస్‌కు చైతన్య సార్ తీసుకురమ్మని చెప్పారు. మేము అక్కడకు పంపాం' అని కానిస్టేబుల్ చెప్పాడన్నారు. దీంతో కంగారుగా అక్కడికి వెళ్లి చూడగా తన భర్త విగతజీవిగా పడి ఉన్నాడని ఆమె వాపోయారు. అప్పటి డీఎస్పీ చైతన్య , ఎస్ఐ గౌస్ విచారణకు తీసుకువెళ్లి నా భర్తను చంపారని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని నీ కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, డబ్బులు ఇస్తానని ఎస్ఐ గౌస్ మభ్యపెట్టి తన భర్త శవాన్ని దహనం చేయించినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అరటి రైతులను అదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్


అరటి తోటలో రైతులతో రాంభూపాల్, నల్లప్ప

బుక్కరాయసముద్రం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక నష్టపోయిన ఉమ్మడి జిల్లా అరటి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సాగు చేసిన అరటి పంటను శుక్రవారం వారు పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డిపల్లికి చెందిన రైతు హనుమంతు నాలుగన్నర ఎకరాల్లో అరటి పంట సాగు చేయడానికి రూ.5 లక్షలరకు పైగా పెట్టుబడి పెట్టారన్నారు. పంట విక్రయిస్తే రూ. 45 వేలు మాత్రమే వచ్చిందన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 15వేల హెక్టార్లలో అరటి సాగు చేస్తే రూ. 700 కోట్లకుపైగా నష్టం వచ్చిందన్నారు. రైతుల ఇంత నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మార్కెట్‌లో అరటి కిలో రూపాయి మాత్రమే ఉందన్నారు. దీంతో రైతులు పంటను మార్కెట్‌కు తరలించలేక గొర్రెలు, పశువులు వదిలేస్తున్నారన్నారు. అరటి పంట టన్ను 15వేలుతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరటి రైతులకు అదుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెత్తు ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

1న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అక్టోబరు 25 నుంచి ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతపురం జిల్లా ఐటీఐ అభ్యర్థులకు డిసెంబరు 1న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, క్రీడలకు సంబంధించిన ధ్రువ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతా పాస్‌బుక్కు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు అన్నీ ఒక సెట్ జిరాక్స్ కాపీలతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాల న్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రూ.118ల ఫీజు చెల్లించాలన్నారు. డిసెంబరు 1న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్) ఉద్యోగాల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన సమయాల్లో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 08518-275025 నంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

30న భగవద్గీతపై పోటీలు

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత జయంతిని పురస్కరించుకుని ఈనెల 30న జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు వెల్లడించారు. టీటీడీ కల్యాణమండపం ఆవరణలో శుక్రవారం గీత జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు భగవద్గీతలోని 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగంపై పోటీలుంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయంలోని దైవాసుర సంపద్విభాగయోగంపై, అలాగే 18 సంవత్సరాలు నిండిన వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలు, ఆధ్యాత్మిక బృందాలు పిల్లలను ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

బాధ్యతగా పనిచేయండి

నూతన ఏఓలకు జడ్పీ చైర్‌పర్సన్ సూచన

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాధ్యతగా పనిచేసి మంచి గుర్తింపు తీసుకురావాలని ఉద్యోగోన్నతి పొందిన ఏఓలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి ఏఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 8 మందికి శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సీనియర్ అసిస్టెంట్‌గా కొంత వరకు బాధ్యత తక్కువగా ఉంటుందని, ఏఓ అంటే అదనపు భారం ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లను కేటాయించారు. లెక్కలు శ్రీనివాసులు (జడ్పీ కార్యాలయం, అనంతపురం), పూర్ణ ఖలందర్ (ఎంపీపీ కార్యాలయం వజ్రకరూరు), కేటీ శ్రీధర్‌శర్మ (ఎంపీపీ, కనగానపల్లి), కె. భీమలింగస్వామి (ఎంపీపీ, రొద్దం), అశోక్‌కుమార్‌రెడ్డి (ఎంపీపీ, నల్లచెరువు), ఏకాంబరేశ్వరయ్య (ఎంపీపీ, గోరంట్ల), అబ్దుల్ రహీమాన్ (ఎంపీపీ, గుడిబండ), సురేష్‌రెడ్డి (ఎంపీపీ కార్యాయలం, తాడిమర్రి)కి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 16 నుంచి పది పబ్లిక్ పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1దాకా జరుగుతాయని విద్యాశాఖ ఏడీ, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 16న తెలుగు పేపర్-1, 18న హిందీ, 20న ఇంగ్లిషు, 23న గణితం, 25న ఫిజిక్స్, 28న బయాలజీ, 30న సోషియల్, 31న ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-2, ఏప్రిల్ 1న ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్షలు ఉంటాయని అయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9-30గంటల నుంచి మధ్యాహ్నం 12-45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

5న సివిల్స్ ఉచిత శిక్షణకు స్ర్కీనింగ్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి డిసెంబరు 5న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ కుష్బూకొఠారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్ర్కీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ విజయవాడలో ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులను జిల్లా బీసీ స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. బయోడేటాతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వార్షికాదాయం ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు.

31మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చినట్లు డీపీఓ నాగరాజనాయుడు శుక్రవారం తెలిపారు. కమిషనర్ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు వీరికి మండలాల కేటాయింపు ఉంటుందన్నారు. ప్రమోషన్ పొందిన వారి వివరాలు ఇలా.. సాదిక్‌వలి, శ్రీధర్‌రావు, అచ్యుతానందబాబు, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, రంగనాయకులు, రాజశేఖర్, గౌస్‌సాబ్, భీమలింగస్వామి, ఉషారాణి, మహమ్మద్‌రఫీ, హిదయతుల్లా, చంద్రశేఖర్, ఏకాంభరేశ్వరయ్య, వీవీ నరసయ్య, సమీర్‌ఖాన్, శారద అక్బర్‌వలి, సుజాత, నాగిరెడ్డి, జిలాన్ బాషా, కాంతమ్మ, నందకుమార్, సుకన్య, సరిత, షేక్షావలి, జయప్రద, శశికళావతిబాయ్ ఉన్నారు. వీరిలో గ్రేడ్-1 కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ పొందినవారు ఉన్నట్లు వెల్లడించారు. వరప్రసాద్‌రావును అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. హనుమేష్, జీవేశ్వరయ్యను కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీరందరికి కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులతో నిబంధనల మేరకు మండలాలు కేటాయిస్తామన్నారు. అనంతరం డెప్యుటేషన్‌పై మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారిగా నియమిస్తామని తెలిపారు.

రూ.7 కోట్ల దోపిడీ కేసులో

చిత్తూరు జిల్లావాసి

- నిందితుడి తండ్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇన్నోవాతో పాటు రెండు ఇనుప క్యాష్ బాక్సులు స్వాధీనం
- రెండో రోజూ గుడిపాలలో బెంగుళూరు పోలీసులు



గుడిపాలలో ఇనుప బాక్సులు
రామాపురంలో వదిలేసిన ఇన్నోవా

చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో కోట్ల రూపాయలు దోపిడీ చేసిన ముఠాలో చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన ఓ వ్యక్తి ఉన్నట్లు గురువారం రాత్రి పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి నిందితుడి తండ్రిని అరెస్టు చేసి బెంగళూరుకు తీసుకెళ్లారు.మరోవైపు రెండో రోజైన శుక్రవారం కూడా గుడిపాలలో బెంగళూరు పోలీసులు గాలింపు కొనసాగింది.ఓ బ్యాంకు నుంచి ఏటీఎంలలో నింపడానికి తీస్కూకెళుతున్న రూ.7.11 కోట్ల నగదును బుధవారం బెంగళూరు నగరంలో ఓ ముఠా తాము ఐటీ అధికారులమంటూ బెదిరించి దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఇన్నోవా వాహనం బుధవారం రాత్రే గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చేరుకుంది. గురువారం ఉదయం మళ్లీ బయల్దేరుతుండగా, 190. రామాపురం వద్ద టైర్ పంక్చర్ అయింది. దీంతో ఆ ఇన్నోవాను అక్కడే వదిలేసి వెళ్లారు. బెంగళూరు నుంచి 13 మంది పోలీసు అధికారుల బృందం గురువారం గుడిపాలకు చేరుకుని ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని.. చిత్తపార, 190.రామాపురం గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు.చిత్తపార గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి రామదాసుకు రవి, రాకేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరూ బెంగళూరులోనే నివాసం ఉంటున్నారు. రామదాసు ఇద్దరు కుమారుల్లో రవి ఈ దోపిడీలో పాల్గొన్నట్లు బెంగళూరు పోలీసులు గుర్తించారు. ఈ రవినే ఆ దోపిడీ సొమ్ముతో బుధవారం రాత్రి చిత్తపారకు వచ్చి గురువారం మరో ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది. వెళ్లేటప్పుడు రెండు ఇనుప క్యాష్ బాక్సుల్ని రోడ్డు పక్కన గడ్డిలో వదిలేసి వెళ్లారు. గురువారం రామదాసుతో పాటు బంధువుల ఇళ్లలోకూడా బెంగళూరు పోలీసులు తీవ్రంగా గాలించారు. రవి ఆచూకీ లేకపోవడంతో అతని తండ్రి రామదాసును అదుపులోకి తీసుకున్నారు.

- ఇదిలా ఉండగా, ఈ దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల్ని చిత్తూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం బెంగళూరు పోలీసులు ప్రకటించారు. బెంగళూరు నగరంలోని బాణసవాడి, కల్యాణనగర ప్రాంతాలకు చెందిన ఆరుగురు నిందితులు ఈ దోపిడీకి పాల్పడినట్లు అక్కడి పోలీసులు చెబుతున్నారు. నిందితుల్ని పట్టుకోవడానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలకు బృందాలను పంపినట్లు బెంగళూరు పోలీసు అధికారులు వివరించారు. దొంగలు రెక్కీ చేశాకే, సీసీ కెమెరాలు లేని సర్కిల్ చూసుకుని దోపిడీకి పాల్పడ్డారని అక్కడి పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మరణంలోనూ ఒక్కటిగా...

అనారోగ్యంతో రిటైర్డు వీఆర్ఏ మృతి.. షాక్‌తో భార్య..


నాగన్న దంపతులు (ఫైల్)

తాడిమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల దాంపత్య జీవితంలో ఒక్కటిసాగిన ఆ దంపతులు మృత్యువులోనూ కలిసి సాగారు. భర్త మరణవార్త విని భార్య అస్వస్థతతో మరణించిన ఘటన తాడిమర్రిలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఎట్టినాగన్న(85) అనారోగ్యంతో పది రోజులుగా అనంతపురంలో చికిత్స పొందుతుండేవాడు. ఆయనకు తోడుగా భార్యలింగమ్మ(80)అక్కడే ఉండేది. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో నాగన్న మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య లింగమ్మ షాక్‌తో స్పృహ కోల్పోయింది. పరీక్షించిన డాక్టర్లు లింగమ్మ పరిస్థితి సీరియస్‌గా ఉందని బెంగళూరుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో కొందరు నాగన్న శవాన్ని తాడిమర్రికి తీసుకురాగా మరికొంతమంది లింగమ్మను తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. సాయంత్రం 6గంటలకు నాగన్న అంతక్రియలు పూర్తిచేశారు. లింగ్మను బెంగళూరులో ఓప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ 6:30గంటలకు ఆమె మృతి చెందారు. నాగన్న, లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

4న హెంజేరు సిద్దేశ్వరస్వామి లక్ష దీపోత్సవం

మడకశిరటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో డిసెంబరు 4వతేదీన లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష దీపోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ములాయంసింగ్ యాదవ్ (జయంతి)




సమాజ్‌వాదీ పార్టీ సంస్థాపకులలో ఒకరైన ములాయం సింగ్ యాదవ్ 1939 నవంబరు 22న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఎటావా జిల్లాలోని సైఫాయ్ గ్రామంలో జన్మించారు. 1992 నుంచి 2017 వరకు సమాజ్‌వాదీ అధ్యక్షుడిగా కొనసాగారు. వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1996-98 మధ్యన యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కేంద్రంలో డిఫెన్స్ మంత్రిగాను కొనసాగారు. ఏడుసార్లు ఎంపీగా, 10సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఘనత ఆయనది. 2022 అక్టోబరు 10న కన్నుమూశారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ (వర్ధంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత ప్రముఖ కర్ణాటక సంగీత గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకా శంకరగుప్తం గ్రామంలో జన్మించారు. గాయకుడిగానే కాకుండా వయోలిన్ విద్వాంసుడు, వాగ్గేయకారుడు, సినీ సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. మృదంగం, కంజీర (డిక్కీ) లోనూ నిష్ణాతులు. 8వ యేటనే కచేరీతో బాలమేధావి అనిపించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 25వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. టీటీడీ, శృంగేరీ పీఠాలకు ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. ప్రపంచ స్థాయిలో 'చేవెలియర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి అందుకున్నారు. అత్యున్నత పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతోపాటు గాన కౌస్తుభగాన, గానగంధర్వ, గానశిఖామణి, జ్ఞానశిఖామణి, గంధర్వ గాన సామ్రాట్ వంటి బిరుదులు, ఇంకా గౌరవ డాక్టరేట్‌లు, ఇతర సత్కారాలు పొందారు. 2016 నవంబరు 22న చెన్నైలో కన్నుమూశారు.

జాక్ లండన్ (వర్ధంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ నవలా రచయిత జాన్ గ్రిఫిత్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. పాత్రికేయుడు, సమాజ సేవకుడిగా పేరొందారు. రచనల ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్ అండ్ వైట్ ఫ్యాంగ్' రచన, చిన్నకథలు 'టు బిల్డ్ ఏ ఫైర్, 'యాన్ ఒడిస్సీ ఆఫ్ నార్త్' వంటివి పేరొందాయి. ఆయన సాధనలకు గ్రేట్ అమెరికన్ సిరీస్ పోస్టల్‌స్టాంప్ విడుదలైంది. ఆయన పేరిట కాలిఫోర్నియాలోని ఓక్‌ల్యాండ్ సమీపంలో ఓ ప్రాంతానికి 'జాక్ లండన్ స్క్వేర్'గా నామకరణం చేశారు. 1916 నవంబరు 22న కన్నుమూశారు.

బాలల మనసు కపటం లేనిది

» జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర హడపద



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విజయపుర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలల మనసు కపటం లేనిదని, బాలల కలలను సాకారం చేసేందుకు తమవంతు ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంటుందని జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర హడపద పేర్కొన్నారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర సమీపంలోని కోమసంద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా శరణ సాహిత్య పరిషత్, అఖిల కర్ణాటక మిత్రసంఘం సంయుక్తంగా ఏర్పాటైన బాలల దినోత్సవం జరిగింది. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అఖిల కర్ణాటక మిత్రసంఘం రాష్ట్రం అధ్యక్షుడు చి మా సుధాకర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం మనోరంజన పేరిట వృథా కారాదన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని చక్కగా రాణించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, శరణసాహిత్య పరిషత్ కార్యదర్శి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్ థెరపీలో మరిన్ని పరిశోధనలు అవసరం



సెమినార్‌లో వైద్య నిపుణులు తదితరులు

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సెల్ థెరపీలో మరిన్ని పరిశోధనలు అవసరమని వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. రామయ్య మెమోరియల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల సంయుక్తంగా సెల్ థెరపీ బెంగళూరు 2025 అనే సెమినార్ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌ఓ అనుబంధమైన ఎన్జీఓ వరల్డ్ నెట్‌వర్క్ ఫర్ బ్లడ్ అండ్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (డబ్ల్యుబీఎంటీ) సహకారంతో శుక్రవారం సెమినార్ జరిగింది. బోన్ మ్యారో ట్రీట్‌మెంట్, కార్-టీ హెమటోపిటిక్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, కటింగ్ ఎడ్జ్ సెల్యులర్ థెరపీస్ అనే విధానాలగురించి నిపుణులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. డబ్ల్యుబీఎంటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డమినో రొన్డెలి, రామయ్య హెల్త్‌కేర్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ నాగేంద్రస్వామి, హెచ్‌ఓడీ అండ్ కన్సల్టెంట్ డాక్టర్ సంతోష్ కే దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి మఠంలో దీపోత్సవం



మఠంలో భరతనాట్య విద్యార్థినుల బృందం



సాయిబాబాకు ప్రత్యేక హారతి

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జయనగర్ ఐదో బ్లాక్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీక దీపోత్సవం గురువారం విశేషంగా కొనసాగింది. ప్రత్యేక కార్యక్రమాలు, భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. సుబుధేంద్రతీర్థ స్వామిజీ సూచన మేరకు మఠం సీనియర్ మేనేజర్ ఆర్‌కే వాదీంద్రాచార్య నేతృత్వంలో కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక దీపోత్సవం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని తీర్థం, అక్షింతలు స్వీకరించారు. దీపోత్సవంలో ఇందిరా విజయ్ నేతృత్వంలో మహానట నృత్యమందిరం విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన అలరించింది.

సాయిబాబా మందిరంలో...

బాగేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, దీపోత్సవం నిర్వహించారు. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, కాగడ హారతి, మధ్యాహ్న హారతి, ధూపహారతి సమర్పించారు. సాయంత్రం తులసికోట వద్ద మహిళలు ప్రత్యేకంగా దీపాలు వెలిగించారు. అనంతరం మందిరం చుట్టూ సాయిబా పల్లకీ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు ఓంసాయి, శ్రీసాయి జయజయసాయి అంటూ పఠిస్తూ సాగారు. దీపోత్సవంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, పురసభ అధ్యక్షులు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుజాతనాయుడు, ఆలయ సేవా ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

బంగారపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొలంలో రాగులను ఎండబెడుతున్న వేళ అకస్మాత్తుగా పాము కాటు వేయడంతో రైతు మృత్యువాత చెందాడు. తాలూకాలోని తిమ్మాపుర గ్రామానికి చెందిన కృష్ణమూర్తి (50) పాముకాటుకు మృతి చెందాడు. మూడు రోజులుగా పొలంలో రాగులను కోత కోసి రాశులుగా పోస్తున్నాడు. శుక్రవారం రాగి కుప్పను ఎండబెట్టేందుకు టార్పాల్ తీశాడు. ఒక్కసారిగా ఎక్కడనుంచో వచ్చిన పాము కాటేసింది. విషం వేగంగా ఒళ్లంతా పాకివేసింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో రక్షించే సాధ్యం కాలేదు. కృష్ణమూర్తికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న సీఐ ఆర్ దయానంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టారు.

దీపోత్సవం జ్ఞానానికి సంకేతం

సిరుగుప్ప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దీపోత్సవ కార్యక్రమం జ్ఞానానికి సంకేతమని బసవమఠం గురువులు బసవభూషణ స్వామిజీ తెలిపారు. సిరుగుప్ప తాలుకా పరిధిలో దేశనూరు రోడ్డు మార్గంలో వున్న శంభులింగేశ్వరాలయంలో దీపోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1,1111 దీపాలను వెలిగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బసవ భూషణ స్వామిజీ మాట్లాడుతూ దీపోత్సవం వలన మనిషికి శాంతి, జ్ఞానం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరమశివుడికి భక్తితో పూజలు చేసి దీపోత్సవం వెలిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అమరేశప్ప, హోళబళ్లారి సిద్దలింగ స్వామిజీ, అభినవ మహంత స్వామిజీ, హాళేకోట మర్రిస్వామి, శివయోగులు, భక్తులు పాల్గొని దీపోత్సవం నిర్వహించారు.

ముగిసిన పోలీసు క్రీడా పోటీలు



విజేతల బృందంతో ఎస్పీ తదితరులు



ఏఎస్ఐ కరిబీరప్పను సన్మానించిన ఎస్పీ డాక్టర్ శోభారాణి

బళ్లారిరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో డీఏఆర్ గ్రౌండ్ మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న పోలీసు క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. క్రీడాపోటీల్లో విజేతలను బళ్లారి ఐజీ వర్తిగా కటయ్యార్, ఎస్పీ డాక్టర్ శోభారాణి అభినందించారు. క్రీడాపోటీలకు బళ్లారి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల నుండి పోలీసులు పాల్గొని క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. సంవత్సరం పాటు క్రీడాకారులు విధుల్లో నిమగ్నమై ప్రతి సంవత్సరం ఆఖరి సమయంలో క్రీడా పోటీల్లో పోలీసు ఉన్నతాధికారుల నేతృత్వంలో నిర్వహించడంతో పోలీసులు ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. అధికారులకు ఎస్పీ ఐజీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న అధికారులను, సిబ్బందిని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం



ఆరోగ్యశిబిరం ప్రారంభంలో ప్రముఖులు

బళ్లారి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర నాయకుల యువసేన, బళ్లారి, వైదేహి ఆస్పత్రి, బెంగళూరు సహకారంతో తాలుకాలోని సిరివర గ్రామంలోని పాండురంగ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్స్ యువసేన జిల్లా అధ్యక్షుడు గడ్డం తిమ్మప్ప మాట్లాడుతూ ఆరోగ్యం ఒక గొప్ప వరమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి వ్యాధి రాకముందే మేల్కొంటే వ్యాధిని నివారించవచ్చు. కార్యక్రమంలో వైదేహి ఆస్పత్రి పీఆర్‌ఓ మల్లికార్జున మాట్లాడుతూ తిమ్మప్ప నిర్వహించే గడ్డం తిమ్మప్ప సామాజిక సేవల్లో భాగంగా ఆరోగ్య శిబిరం గ్రామస్తులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో తిమ్మప్ప సేవలకు తమ సహకారం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు పి దొడ్డబసప్ప ఉపాధ్యక్షులు రమేష్ సామాజిక కార్యకర్త, తాలుకా యువ కురుబ సంఘం అధ్యక్షులు శేకలింగ బెంగళూరు వైద్య పీఆర్ఓ మల్లికార్జున డాక్టర్ మధు, హెల్త్ ఆఫీసర్ మంజుశ్రీ డాక్టర్ మహేంద్ర సింగ్, ఆశా వర్కర్లు, కార్యకర్తలు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సిరివరంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంబిస్తున్న సామాజిక సేవ యువ నాయకుడు గడ్డం తిమ్మప్ప, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శేక్ లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారంపై ప్రకటన చేయాలి

» రైతు సంఘం నేత చామరస మాలిపాటిల్



డీసీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు



వినతి పత్రం అందజేస్తున్న చామరస మాలిపాటిల్

రాయచూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతివృష్టితో పంట నష్టానికి గురైన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించాలని కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనల గౌరవధ్యాక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చామరస మాలిపాటిల్ మాట్లాడుతూ రాయచూరు మార్కెట్‌కు పెద్ద ఎత్తున పత్తి తరలి వస్తుండగా కేవలం రూపాయిలు 6500కు మించి క్వింటాల్ ధర లభించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధర రూ.8110 ప్రకటించగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతి కారణంగా రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. అదే సమయంలో నారాయణపూర్ ఉప కాలువల రస్తాలో జంగల్ కటింగ్ చేపట్టి రైతులు రాకపోకలకు వీలు కల్పించాలన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన పనులు పూర్తి నాసిరకంగా ఉన్నాయని క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా దృష్టిసారించాలని కోరారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

» రూ.లక్ష జరిమానా

» రాయచూరు కోర్టు న్యాయాధికారి తీర్పు

రాయచూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి కోర్టు కఠిన కారాగార శిక్ష విధించింది. సన్న పామప్ప అలియాస్ పామన్న నేరం చేసినట్లు రుజువు కావడంతో రాయచూరు జిల్లా మూడో అదనపు ఫాస్ట్‌ట్రాక్ న్యాయాధికారి బీబీ జకాతి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. సింధనూరు తాలూకాలోని ఓ గ్రామంలో 2020 జనవరిలో పామన్న ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు సింధనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డీఎస్పీ విశ్వనాథ్‌రావ్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బాలచంద్ర లక్కం నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు. సింధనూరు రూరల్ పోలీసులు సాక్షాధారాలను న్యాయస్థానానికి అప్పగించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. దీంతో పాటు ప్రభుత్వ పరంగా బాధితులకు ఇచ్చే పరిహారం నిధుల ద్వారా రూ.లక్ష అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు.

అలరించిన ప్లేటోపియా సంబరం



ఫ్యాషన్ షోలో యువతులు

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బసవనగుడి నేషనల్ కళాశాల మైదానంలో ప్లేటోపియా జెన్ అల్ఫా ఫ్యూజన్ ఫెస్ట్ పేరిట రెండు రోజుల సంబరం చేసింది. నగరానికి చెందిన 3వేలమందికిపైగా కుటుంబాలు పాల్గొన్నాయి. ఈవెంట్ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్లేటోపియా కేవలం ఒక కార్యక్రమం కాదని కుటుంబాల అనుభవాలను పంచుకునే వేదికగా జరిపామన్నారు. పిల్లలు, తల్లిదండ్రులు సంతోషపడేలాంటి కార్యక్రమాలు కొనసాగాయన్నారు. సేల్స్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ ఫ్యాషన్‌షోతోపాటు పలు ప్రదర్శనలలో చిన్నారులు సంతోషంగా పాల్గొన్నారన్నారు. గేమింగ్ తో పాటు ప్రత్యేక రుచుల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యా ఫ్యాషన్ అకాడమీతోపాటు పలువురు భాగస్వామ్యులయ్యారు.

రెటినోపతిపై దేశవ్యాప్త ప్రచారం

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రుల ద్వారా మధుమేహంలో రెటినోపతిపై దేశవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించదలిచినట్టు రీజనల్ డైరెక్టర్ ఆమోద్ నాయక్ తెలిపారు. మధుమేహం నియంత్రణలో లేకుంటే కళ్లలో ఉండే రక్తనాళాలపై పరిణామం చూపనుందని, తద్వారా దృష్టిలోపం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రోగలక్షణాలను ప్రాథమికదశలోనే గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మధుమేహ బాధితులు పెరిగిపోతున్నారని రెటినోపతిపై కనీస అవగాహన కల్పించాలని దేశవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించదలిచామన్నారు. నవంబరు 30వరకు ఉచిత కంటి పరీక్షలను కొనసాగించదలిచినట్టు తెలిపారు. చికిత్సలలో 50శాతం రాయితీలు ఉంటాయని విట్రియో రెటినోసర్జన్ మోహన్‌రాజ్ తెలిపారు. మీడియా సమావేశంలో చీఫ్ క్లినికల్ అధికారి అశ్విన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న లాన్‌ఎక్సెస్

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దుర్బలమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్న ప్రముఖ రసాయనాల సంస్థ లాన్‌ఎక్సెస్ గత ఏడాదితో పోలిస్తే రెండో త్రైమాసికంలో 16.3శాతం లాభం తగ్గినట్టు ప్రకటించారు. మూడో త్రైమాసికంలో లాభాలు పెరిగే అవకాశం ఉన్నాయని సంస్థ సీఈఓ మాథియాస్ జార్చెట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఇతర ప్రభావాలపై మార్పులు లేకుండా ఖర్చులను తగ్గించుకోదలిచిందన్నారు. స్ట్రీమ్‌లైన్ ద్వారా మార్కెట్‌స్థానాన్ని గరిష్టంగా పెంచుకోదలిచినట్టు తెలిపారు. రసాయన పరిశ్రమకు రాజకీయ నేతల ద్వారా ఎక్కువ మద్దతు అవసరం ఉందన్నారు. 2023లో ఫార్వడ్ యాక్షన్‌ప్లాన్ ద్వారా సుమారు 150 మిలియన్ యూరోల శాశ్వత వార్షిక ఆదాయం సాధించిందన్నారు. 2027 నాటికి 50 మిలియన్ యూరోలు ఉత్పత్తిని పెంచదలిచినట్టు తెలిపారు.

ఆరోగ్య రక్షణలో సింగపూర్‌తో భాగస్వామ్యం


బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యరక్షణలో సింగపూర్ సంస్థ భాగస్వామ్యంతో ముందుకు సాగనున్నట్టు నారాయణ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ దేవిప్రసాద్‌శెట్టి తెలిపారు. సింగ్‌హెల్త్, డ్యూక్ ఎన్‌యూఎస్ గ్లోబల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్‌కేర్ అండ్ లీడర్‌షిప్ మేనేజిమెంట్ ద్వారా భారత్‌లో క్రాస్ బార్డర్ సహకారం బలోపేతం చేయదలిచింది. ఎగ్జిక్యూటివ్ మాస్టర్ హెల్త్‌కేర్ అండ్ లీడర్‌షిప్ మేనేజిమెంట్ ద్వారా ప్రాంతీయ నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించదలిచినట్టు ప్రకటించారు. ఆసియా పరిధిలో ఆరోగ్య వ్యవస్థలో మార్పును కొనసాగించదలిచినట్టు లక్ష్యంగా కలిగారు. సింగపూర్, భారత్‌లలో ఆరోగ్యరంగంలో భాగస్వామ్యం చేసుకోదలిచారు. అరవింద్ ఐ హాస్పిటల్ కార్నియా స్పెషలిస్ట్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజలు ఉత్తమ, సుస్థిరమైన ఆరోగ్య సేవలను సమకూర్చదలిచినట్టు అభిప్రాయపడ్డారు. సింగపూర్, భారత్‌లలో తొలి సహకారాన్ని అందిస్తోందన్నారు. 15నెలల తాత్కాలిక కార్యక్రమాన్ని సింగపూర్‌లో ప్రారంబిస్తామని భారత్‌తోపాటు థాయ్‌ల్యాండ్, ఫిలిప్పీన్స్‌లో ఎగ్జిక్యూటివ్ మాస్టర్స్ కోర్సును అందుబాటులోకి తీసుకురాదలిచినట్టు డాక్టర్ పాల్ శాలిన్స్ తెలిపారు.

సర్కారు బడుల మూసివేతను ఆపాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

రాయచూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదా విలీనం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని ఏఐడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు శుక్రవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడినవిద్యార్థి నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా మొత్త 700 పాఠశాలలను మూసివేసేందుకు తీసుకున్న నిర్ణయం నిరుపేదలను విద్యకు దూరం చేసేదిగా ఉదన్నారు. ప్రభుత్వ బడుల్లోచదువే వారంతా పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులేనని వారిని విద్యకు దూరం చేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఇదే సమస్యపై ఎస్ఎఫ్ఐ విద్యార్థులు జాలహళ్ళిలో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం తీరును నిరశిస్తు జాలహళ్ళి పట్టణంలోని మహత్మ గాంధి సర్కిల్ వద్ద మానవహారం ఏర్పటు చేసి నిరసన తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.96	1630.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,796	3,469
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,981	6,706
నీటి నిల్వ (టీఎంసీలు)	73.14	96.61

25న మెగా జాబ్ మేళా

నిరుద్యోగులకు సదావకాశం: ఎమ్మెల్సీ సతీశ్



బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైఎం.సతీష్ ఫౌండేషన్, వీరశైవ విద్యావర్ధక సంఘం, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నిర్మాణ ఇన్స్టిట్యూట్స్ సంయుక్తంగా ఈనెల 25 మంగళవారం బళ్లారిలోని వీరశైవ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు శాసనమండలి సభ్యుడు వై.ఎం.సతీశ్ శుక్రవారం మీడియాతో తెలిపారు. మంగళవారం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రత్యక్ష వాక్-ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీఐ, డిప్లమా, బీఎస్సీ డీ.ఫార్మా, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పీయూసీ, పదవ తరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా యొక్క 10కాపీలు, చాయాచిత్రాలు, ఆధార్‌కార్డ్, మార్క్సుషీట్ కాపీలు, తీసుకురావాలన్నారు. 9886367517, 709095 3830 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం'

సిరుగుప్ప నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలతో ఆరోగ్యానికి హానికరమని కరూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ జాఫర్ సూచించారు. శుక్రవారం తాలుకాలోని కరూరు ప్రభుత్వ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో మనిషికి కిడ్నీలు, గుండెపోటు, క్యాన్సర్ సోకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్, డాక్టర్ స్వర్ణలత పాల్గొన్నారు.

నిష్క్రియాత్మక ఖాతాలతో ఆర్థిక వ్యవస్థకు చేటు

● సరైన పత్రాలతో వారసులు సొమ్ము పొందవచ్చు ● జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ,నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలుగా బ్యాంకుల్లో ఉన్న నిష్క్రియాత్మక ఖాతాలు, డిపాజిట్లు, ఇతర కారణాల వల్ల డబ్బును ఉపసంహరించుకపోవడం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు.శుక్రవారం నగరంలోని పాత జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో 'మీ డబ్బు మీ హక్కులు' ప్రచారంపై ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్‌బీఐ , ఎస్ఎల్‌బీసీ బళ్లారి జిల్లా పరిపాలన ఆదేశాల మేరకు క్లెయిమ్ చేయని నిష్క్రియ ఖాతాల మూసివేత , తిరిగి సక్రియం చేయడం కోసం జరిగిన అవగాహన పురోగతి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిద్రాణమైన ఖాతాలు, క్లెయిమ్ చేయని డిపాజిట్లు,బీమా పాలసీ మొత్తాలు, వాటాలను పరిష్కరించడానికి ఆర్థిక సేవల విభాగం అక్టోబరు 3 నుంచి డిసెంబరు 31వరకు ప్రత్యేక ప్రచారం చేపట్టిందన్నారు. 'మీ డబ్బులు మీహక్కులు' ప్రచారం కస్టమర్లకు వారి వారసులకు ప్రయోజనం చేకూరుస్తుందని, దీనిని వారసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బళ్లారి జిల్లాలో 2,73,484 నిష్క్రియ ఖాతాలు ఉన్నాయని, వాటి మొత్తం విలువ రూ. 73.54కోట్లు అని లీడ్ బ్యాంక్ మేనేజర్ గిరీష్ కులకర్ణి తెలిపారు. 10సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉన్న నిష్క్రియ ఖాతాలను కేవైసీ కోసం అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా వారసులకు అందజేస్తామన్నారు. ఈ డబ్బు సంబంధిత ఖాతాదారులకు, వారసులకు అందజేస్తామన్నారు. ఈ విషయంలో ప్రత్యేక ఉమ్మడి శిబిరాలను నిర్వహించాలని ఆయన సంబంధిత బ్యాంక్ అధికారులకు తెలిపారు. స్థిక ఖాతాలు క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్న వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతాలను జాతీయం చేసిన , ప్రైవేట్ బ్యాంకులుగా వర్గీకరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సి.గౌతమ్ అన్నారు. ఈసందర్భంగా అదనను జిల్లా కలెక్టర్ చాలా కాలంగా క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్ బీమా ప్రీమియంలు , బ్యాంకుల్లోని వాటాల అధికారిక కాపీలను యజమానులకు , చట్టబద్ధమైనా వారసులకు అందజేశారు, 33ఖాతాలలోని రూ. 8లక్షల మొత్తాన్ని భారత జీవిత బీమా (ఎల్ఐసీ) సెటిల్ చేసిన అధికారులను అభినందించారు. స్టేట్ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ఇండియా బళ్లారి రీజనల్ మేనేజర్ రవి మేప్రామ్, జిల్లాలోని బ్యాంకు శాఖల మేనేజర్లు అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.



బీమా ప్రీమియం సొమ్మును యజమానులకు అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : మాజీ మేయర్

బళ్లారి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమయం కేటాయించి వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మాజీ మేయర్ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం నగరంలోని విమ్స్ ఆస్పత్రి మైదానంలో జిమ్ ఏర్పాటుకు ఆమె భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ నగరంలోని 34వ వార్డులోని మైదానంలో ప్రతి రోజు సీనియర్ సిటిజన్‌లో వాకింగ్, జిమ్ చేసేందుకు అనుకూలంగా వుంటుందని బళ్లారి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ మైదానంలో వ్యాయామం కోసం జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజెన్లు వ్యాయామం అనేది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచే కండరాలు, హృదయానల వ్యవస్థను బలోపేతం చేసే శారీరక శ్రమ అన్నారు. వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. మీ రోజు వారి కార్యక్రమాలను తక్కువ శక్తితో మరింత మెరుగుపడేలా అనుకూలంగా వుంటుందని తెలిపారు. ఆరోగ్యంగా వుండటానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సామాజిక కార్యకర్తలు ఎం సుబ్బరాయుడు, మహిళా కాంగ్రెస్ ప్రముఖురాలు షమీం జెట్లీ యువ కాంగ్రెస్ నాయకులు యోగానందరెడ్డి, వ్యాపారవేత్త హగరి గాదెలింగప్ప, స్థానికులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మాజీ మేయర్ రాజేశ్వరి తదితరులు



ఏడీసీ జుబేర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

పాఠశాలల విలీనంపై ఎస్ఎఫ్ఐ నిరసన

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపారు. రాష్ట్ర ప్రభుత్వం 700కేపీఎస్ పాఠశాలలను ప్రారంభించే పేరుతో 5,000 కి పైగా ప్రభుత్వ పాఠశాలలనుమూసేయాలని ప్రయత్నిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డబసవరాజ్ మండిపడ్డారు. సర్కార్ పాఠశాలపై ప్రభుత్వానికి ఆసక్తి లేదని, ప్రైవేట్ యాజమాన్యానికి అనుకూలంగా ఉందన్నారు. విలీనం తరువాత గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు వారే అనుమతులు ఇస్తున్నారన్నారు. దీంతో వాటి సంఖ్య భారీగా పెరుగుతోందన్నారు. ప్రభుత్వ విద్య రాష్ట్రంలోనే ఉండకపోతే భవిష్యత్తులో విద్య వ్యాపారంగా మారుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతోందన్నారు. బళ్లారిలో ప్రభుత్వ పాఠశాలలను కూడా విలీనం చేయడానికి ప్రయత్నం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం నిర్వహిస్తుందన్నారు. నగరంలోని మున్సిపల్ కళాశాల ప్రాంగణం నుంచి ఊరేగింపుగా వెళ్ళి అదనపు జిల్లాకలెక్టర్ కు వినతి అందజేశారు. ఈసందర్భంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

భాషకు హద్దులు లేవు : రంగనాథ్



మాట్లాడుతున్న కవి, అనువాదకుడు డాక్టర్ రంగనాథ్ అరనకట్టే

హోస్పేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) ఏ భాషకు అయినా సరిహద్దులు లేవని, ప్రజాదరణతో విస్తారంగా వ్యాపిస్తాయని హోస్పేట్ కు చెందిన కవి, అనువాదకుడు డా. రంగనాథ్ అరనకట్టే అన్నారు. జాతీయ ఐక్యతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అల్లమా హాలులో విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటగిరి అధ్యక్షతన కన్నడ సాహిత్య అధ్యయన విభాగం నిర్వహించిన బహుభాషా కవితా సభలో ఆయన మాట్లాడారు. పండితులే కాదు మన జానపద కవులే శతాబ్దాల క్రితమే భాషా సామరస్యం నిర్మించారు. కన్నడ, తమిళ భాషలు అన్ని ద్రావిడ మూలం నుంచి వచ్చినవే నన్నారు. జానపద కవులు మౌఖిక సంప్రదాయం ద్వారా ఈ సామరస్యాన్ని నిర్మించారు. కన్నడ, తమిళ భాషలు అసలు ద్రావిడ భాషలో విలీనం అయ్యాయని, అవి చెల్లాచెదురుగా ఉండి తమ సొంత స్థానాన్ని కనుగొన్నాయన్నారు. ఇతర కవులు పాల్గొని కన్నడ, హిందీ, లంబానీ, ఉర్దూ, తెలుగు, తమిళం, ఇంగ్లీష్, మరాఠీ బాషలలో తమ కవితలను పఠించారు. నందిని, ప్రభాకర్, రవీంద్ర, బోరయ్య, పాలయ్య తెలుగులో కవితాపఠనం చేశారు.

పోలీస్ స్టేషన్ ప్రహరీపై ఆకట్టుకుంటున్న చిత్రాలు



గోడమీది చిత్రాలు

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుడితిని పోలీస్ స్టేషన్ ప్రహరీపై అదానీ ఫౌండేషన్ వేసిన చిత్రపటాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ గోడపై 112 పోలీసు సమాచారం 1930 సైబర్ కేర్ సమాచారం 1098 చైల్డ్ లైన్ హెల్మెట్ వాడకం విషయంపైన బాల్య వివాహాలు విషయంపైన ఇతర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా అదానీ ఫౌండేషన్ చిత్రాలు గీశారు. చిత్రలేఖనంతో సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని అదానీ ఫౌండేషన్ మేనేజర్ రిజ్వాన్ తెలిపారు.

హోసూరు జోన్



శానమావు అడవుల్లో మందగా వెళ్తున్న ఏనుగులు

ఏనుగుల సంచారంతో రైతుల్లో ఆందోళన

హోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి 40కుపైగా ఏనుగులు ఊడేదుర్గం అటవీప్రాంతం మీదుగా శానమావు అటవీ ప్రాంతానికి చేరుకుని అక్కడే విడది చేశాయి. అటవీ అధికారులు ఈ ఏనుగులను రాత్రిపూట శానమావు, సంపత్ పారై మీదుగా రాయకోట అటవీప్రాంతానికి తిరిగి మళ్ళించారు. కానీ పదికి పైగా ఏనుగులు శానమావు అటవీప్రాంతానికి తిరిగి వచ్చాయి. దీంతో అటవీ అధికారులు రాత్రింబవళ్లు ఏనుగులు గ్రామాలు, పొలాల వైపు రాకుండా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్న వరి, రాగి, జొన్న వంటి పంటలను ఏనుగులు దెబ్బతీసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను వెంటనే కర్ణాటకలోని బన్నేరుఘట్ట అటవీ ప్రాంతానికి వాపసు పంపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ యూనియన్ సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న బీజేపీ నాయకులు

హోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వేపనపల్లి దక్షిణ మండలం కురుబరపల్లి ప్రైవేట్ పాఠశాల ఆవరణలో బీజేపీ మండల యూనియన్ కార్యనిర్వాహకుల సమావేశం జరిగింది. సమావేశానికి మండల అధ్యక్షుడు గోవిందరాజు అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, కృష్ణగిరి పశ్చిమ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్బరసన్, జిల్లా కార్యదర్శి న్యాయవాది సుందరమూర్తి ముఖ్యులుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావిస్తూ ప్రజల్లో వాటిపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకం రాష్ట్ర కార్యదర్శి డీ మల్లప్పన్ పాల్గొన్నారు.

మినీ ఐపీఎల్ రెండో సీజన్‌లో స్థానిక ఆటగాళ్లు

హోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీలు 2008లో ప్రారంభమై 16 సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఐపీఎల్ పోటీలపై ప్రతి సంవత్సరం అంచనాలు తగ్గడం లేదు. ఐపీఎల్ చూసే ప్రతి క్రికెటర్ తమ అభిమాన జట్టు తరపున కనీసం ఒక్క మ్యాచ్‌లోనైనా పాల్గొనగలిగినందుకు గర్వంగా భావిస్తున్నారు. అలాంటి యువకులు అంచనాలను నెరవేర్చారు. కృష్ణగిరి జిల్లాలో మినీ ఐపీఎల్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నారు. ఐపీఎల్ టోర్నమెంట్‌ను డీఎంకే యూత్ వింగ్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసన్ రెండోసీజన్ పోటీలను లాంఛయంగా ప్రారంభించారు. కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని సెంబరసనపల్లి గ్రామానికి చెందిన యువత మూడేళ్లుగా చేస్తున్న ప్రయత్నం సాకారం అవుతోంది. ఐపీఎల్‌లో పాల్గొనే 10 జట్లలో లఖ్‌నవ్, గుజరాత్ మినహా చెన్నై, ముంబై, రాజస్థాన్‌తో సహ 8జట్లు రంగంలో ఉన్నాయి. ఐపీఎల్‌లో పాల్గొనే ఆటగాళ్లకు తమ ఆట సమయాన్ని ఆన్‌లైన్‌లో బుక్ అవకాశం కల్పించారు. కృష్ణగిరి జిల్లా యువత ఐపీఎల్ కోసం 350 మంది ఆటగాళ్లను నమోదు చేసుకుంది. వారి కోసం గత నెలలో వేలం జరిగింది. 8 జట్ల యజమానులు చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌లను తమ ఇష్టపడే జట్లుగా ఎంచుకున్నారు. ప్రతి జట్టుకు వారి పేర్లతో 1 లక్ష పాయింట్లు కేటాయించారు. ఆటగాళ్లను పాయింట్ల ప్రాతిపదికన వేలం వేశారు, వారికి జీతం చెల్లించబడదు, జట్టు యాజమాన్యం 15 నుంచి 20 మంది ఆటగాళ్లతో సహ 160 మంది ఆటగాళ్లను వేలంలో తీసుకున్నారు. ఆయా జట్ల ఆటగాళ్లకు ఐపీఎల్‌లో జట్లు ధరించే డ్రెస్‌ను అందచేశారు. ఇరవై ఓవర్ల టోర్నమెంట్‌గా జరుగుతుంది. 8 జట్లను 2 గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి జట్టు 3 మ్యాచ్‌లు ఆడుతుంది. 4 జట్లు వారు గెలిచిన పాయింట్ల ఆధారంగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. మొదటి బహుమతి రూ. 1 లక్ష, రెండో బహుమతి రూ.50వేల నగదు బహుమతి ట్రోఫీని అందచేయనున్నారు. కాగా మూడో బహుమతిగా రూ.25వేల విలువైన వాషింగ్ మెషిన్‌ను ఇవ్వనున్నారు. ఐపీఎల్ టోర్నమెంట్ నిర్వాహకులు పంజాబ్ కింగ్స్ జట్టు యజమాని, అన్నాడీఎంకే ఎంజీఆర్ యూత్ వింగ్ జిల్లా జాయింట్ సెక్రటరీ రంగనాథన్, శూలగిరి సౌత్ యూనియన్ డీఎంకే డిప్యూటీ సెక్రటరీ మునిచంద్రన్, డీఎంకే నార్త్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు లఘుమనాయుడు పాల్గొన్నారు.



కప్పుతో ఆటగాళ్లు

న్యాయరంగంలో అపార అవకాశాలు

● ప్రొఫెసర్ సీఎస్ పాటిల్

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తి పవిత్రమైనదని, న్యాయ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సరైన రీతిలో ఉపయోగించుకోవాలని కర్ణాటక లా అండ్ పార్లమెంటరీ రిఫార్మ్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీఎస్ పాటిల్ అన్నారు. శుక్రవారం బెంగళూరులోని కర్ణాటక లా అండ్ పార్లమెంటరీ రిఫార్మ్స్ ఇన్‌స్టిట్యూట్ , బళ్లారిలోని వుంక సన్నరుద్రప్ప లా కాలేజీ సహకారంతో జిల్లాపంచాయతీ హాల్లో వివిధ లా కాలేజీల నుంచి లా విద్యార్థుల కోసం నిర్వహించిన కలబురగి జోన్ స్థాయి 'మెడల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సెషన్ కాంపిటీషన్' కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజంలోని తప్పులను గమనించి వాటిని సరిదిద్దాల్సిన గంభీరమైన బాధ్యత న్యాయ విద్యార్థులపై ఉందన్నారు. చట్టాలను అర్థం చేసుకుని, సమాజానికి అవగాహన కల్పించాల్సి బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. చట్టపరమైన చట్రాన్ని అర్థం చేసుకోవడానికి సీనియర్లు , జూనియర్లు సమానంగా చర్చించుకోవాలన్నారు. న్యాయరంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, విద్యార్థులు నిజాయితిగా పని చేయాలని, తమ వృత్తిలో సంతృప్తి చెందాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పరిశోధనా విభాగాధిపతి డాక్టర్ రేవయ్య ఒడయార్ మాట్లాడుతూ ఈసంస్థ ద్వారా న్యాయ , పార్లమెంటరీ కార్యకలాపాలను విద్యార్థులకు అచరణాత్మకంగ ప్రదర్శిస్తామన్నారు. ఈసంస్థ 2005లో అప్పటి న్యాయ మంత్రి హెచ్‌కే పాటిల్ నాయకత్వంలో ప్రారంభించారన్నారు. చట్టానికి సంబంధించిన ముసాయిదాలు బిల్లులను ప్రభావితం చేస్తాయన్నారు. ఈసందర్భంగా వుంకి సన్నరుద్రప్ప న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్, రజనీకుమారి, న్యానిర్ణేతలుగా డాక్టర్ రమేశ్, వెంకటేశ్, సరోజ, కలబురగి ప్రాంతంలోని 55 మంది లా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ప్రతిపక్ష, అధికార పార్టీలుగా విభజించి పోటీలు నిర్వహించారు. పోటీలో విద్యార్థులు ముఖ్యమంత్రి స్పీకర్, మంత్రుల పాత్రలను పోషించారు. సభాకార్యక్రమాలను సమగ్రంగా ప్రదర్శించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎస్ పాటిల్ తదితరులు

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి : తహసీల్దార్

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని తాలుకా నోడల్ అధికారి, సిరిసి అసిస్టెంట్ కమిషనర్ కన్యారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్ముందు ఏ శాఖ నుంచి ఫిర్యాదులు రాకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పట్టణంలో శిక్షణ శాఖలో కొంతవరకు సమస్య ఫిర్యాదులు వస్తున్నాయి. ఆ సమస్యలు రాకుండా శిక్షణ శాఖ చేపట్టుకోవాలని సూచించారు. విద్యుత్ అటవీ వ్యవసాయ శిక్షణ పురసభ కేఎస్‌ఆర్టీసీ లేబర్ ఆహార రెవెన్యూ పోలీసు నీటి పారుదల ఎక్సైజ్ వివిధ శాఖల అధికారులతో చర్చలు జరిపారు. విధుల్లో ఏ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించిన వారిపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణవాసులు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతినిత్యం కంప్లి నడిబొడ్డున వుండే సోమప్ప చెరువు చుట్టూ ముళ్ల కంచెలు తొలగించి ఉదయం సాయంత్రం వేళల్లో వచ్చే యోగా, ధ్యానం చేపట్టి వారికి అనుకూలం చేయాలన్నారు. రేణుక యల్లమ్మ దేవస్థానం ముందు భాగంలో పూర్తిగా స్వచ్ఛత చేపట్టి యోగ చేసేందుకు అనుగుణంగా చేపట్టాలని కోరారు. అలాగే లక్ష్మన్న మారెన్న రవి మాట్లాడుతూ కంప్లి ప్రభుత్వాస్పత్రి స్త్రీ రోగ నిపుణులు వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ నాయక, తాలుకా పంచాయతీ అధికారి శ్రీకుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి ఏసీ కావ్యరాణి

కోదండరాముడి ఆలయంలో ప్రత్యేక పూజలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అలంకరణలో సీతారామలక్ష్మణులు

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని సన్నాపురం నారాయణ స్వామి క్యాంపులో కార్తీకమాసం ముగింపు సందర్భంగా గురువారం ఆలయంలో కార్తీక దీపోత్సవం, కోలాట కోదండ రామస్వామి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. నెల పాటు ఆలయం వద్ద వివిధ ధార్మిక కార్యక్రమాలు, పూజలు, వివిధ చిత్రాలు వేస్తూ అందులో జ్యోతులు వెలిగిస్తూ పూర్తిగా కట్టుకుంటూ నెల పాటు మహిళలు పూజలు నిర్వహించారు. జరుపుతున్నారు. నారాయణస్వామి క్యాంపుకు చెందిన సుధా అనే మహిళ ప్రతినిత్యం ఒక దేవుడు చిత్రాలు వేస్తూ అందులో జ్యోతులు వెలిగిస్తూ భక్తిని చాటుకుంది. గురు వారం చివరి రోజు కావడంతో పలు ఆలయాల్లో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. విజయవంతంగా పూజలు నిర్వహించినట్లు అచ్యుత రాయవరం అధ్యక్షుడు రమణయ్య తెలిపారు.



ఆకట్టుకుంటున్న రామాంజనేయ చిత్రం

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● గర్భిణులకు ఆరోగ్య అధికారి మేరీ మౌనిక సూచన



గర్భిణులకు సీమంతం చేస్తున్న వైద్యాధికారులు

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సముదాయ ఆరోగ్య శాఖ అధికారి మేరీ మౌనిక సూచించారు. శుక్రవారం తాలుకా సమీపంలోని గుడిదుర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెల తప్పకుండా తమ సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో చెకప్ చేయించుకుని మందులు వాడాలన్నారు. వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వాలన్నారు. మందులతో పాటు పండ్లు కూరగాయలు సేవించడం వల్ల ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సురక్షణాధికారి శాంతికుమార్ నిరీక్షణ అధికారి లక్ష్మీ అంగన్‌వాడీ కార్యకర్త పద్మ ఈరమ్మ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాలు ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి

● బసవ ధర్మపీఠ అధిపతి కొర్లహళ్లి వీరన్న లింగాయత్



నిరసనలో రాష్ట్రీయ బసవదళ్ సభ్యులు

గంగావతి రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి) కర్మాగారాలు కేవలం లాభాలపైనే కాకుండా ప్రజారోగ్యముపై దృష్టి పెట్టాలని ధర్మపీఠ అధిపతి కొర్లహళ్లి వీరన్న లింగాయత్ అన్నారు. కొప్పళ పరిసర ప్రాంతాల్లో మూడు ఫాక్టరీలు విస్తరణ చేస్తున్నా నేపథ్యంలో రాష్ట్రీయ బసవదళ్, మద్దతుతో జరగుతున్నా ధర్నా శుక్రవారంకు 22వరోజుకు చేరింది. ఈ ఫ్యాక్టరీలు ఇలాగే కొనసాగుతు విస్తరణ చేసుకుంటు పోతే ప్రజలంత ఊరువదిలి పోవల్సివస్తుందని ఇప్పుడే ప్రజలు బయటకు వచ్చి పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. శుక్రవారం ఆధ్యాత్మికతో ఆందోళన చేపట్టారు. గురు బసవేశ్వర చిత్రపటానికి పూజలు నిర్విహిచి భజనలతో నిరసన తెలిపారు. ఈ ధర్నకు బసవశ్రీ నర్సింగ్, పారామెడికల్ కాలేజి విద్యార్థులు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ దొడ్డబసప్ప మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల వచ్చే దుమ్మే కాదు విషం అని మన ఊపిరిని నెమ్మదిగా చంపుతుంది అని వ్యాఖ్యానించారు. ప్రమాదకర వాయవులు ఫ్యాక్టరీల నుండి వెలువడుతున్నాయన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో అల్లమ ప్రభు బెట్టదూర్, కెబి, గోవపాల్, మంజునాథ్ గొండబా, కాంగ్రెస్ మహిళా నేత జ్యోతి గొండబా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.